సాక్షి తిరుపతి

శుక్రవారం । 9 । ఫిబ్రవరి । 2024



జనం గుండెల్లో జత కట్టడమే..

జనం గుండెల్లో జత కట్టడమే జగనన్న ఎజెండా అని తుడా చైర్మన్ చెవిరెడ్డి మోహిత్‌రెడ్డి కొనియాడారు. - 8లో



ఎర్రచందనం స్వాధీనం

అక్రమంగా తరలిస్తున్న 378 కిలోల ఎర్రచందనాన్ని స్వాధీనం చేసుకుని, స్మగ్లర్‌ని అరెస్ట్ చేసినట్టు పోలీసులు తెలిపారు. - 8లో



నామసంకీర్తన ప్రీతికరం

నామ సంకీర్తన భగవంతునికి ప్రీతికరమని కర్ణాటకలోని కుక్కే సుబ్రమణ్యస్వామి మఠాధిపతి ఉద్ఘాటించారు. - 8లో

న్యూస్‌రీల్

శ్రీవారి దర్శనానికి 8 గంటలు

తిరుమల: తిరుమలలో భక్తుల రద్దీ సాధారణంగా ఉంది. క్యూకాంప్లెక్స్‌లో 3 కంపార్ట్‌మెంట్లు నిండాయి. బుధవారం అర్ధరాత్రి వరకు 65,683 మంది స్వామివారిని దర్శించుకోగా 21,177 మంది భక్తులు తలనీలాలు సమర్పించారు. స్వామివారికి కానుకల రూపంలో హుండీలో రూ.3.59 కోట్లు సమర్పించారు. టైం స్లాట్ టిక్కెట్లు కలిగిన భక్తులకు సకాలంలోనే దర్శనమవుతోంది. దర్శన టిక్కెట్లు లేని భక్తులకు 8 గంటల్లో దర్శనం లభిస్తోంది. ప్రత్యేక ప్రవేశ దర్శనం టిక్కెట్లు కలిగిన భక్తులకు 2 గంటల్లో దర్శనం లభిస్తోంది.

రెయిన్‌బో ఆగ్రోవెట్‌తో ఒప్పందం



కంపెనీ ప్రతినిధులకు ఎంఓయూ పత్రాలను అందజేస్తున్న వీసీ భారతి

తిరుపతి సిటీ: పట్టు రైతుల ఉత్పాదకతను పెంపొందించే ఉత్పత్తులను ఆవిష్కరించేందుకు శ్రీ పద్మావతి మహిళా విశ్వవిద్యాలయం, రెయిన్‌బో ఆగ్రోవెట్ సెరీటెక్ ప్రైవేట్ లిమిటెడ్ కంపెనీతో గురువారం ఒప్పందం కుదుర్చుకుంది. ఈ సందర్భంగా వీసీ డీ.భారతి మాట్లాడుతూ ఒప్పందం ద్వారా బయోసైన్స్ అండ్ సెరికల్చర్ విభాగంలో విస్తృత పరిశోధనలు చేసి ఫలితాలు క్షేత్రస్థాయికి చేరేలా చేయడమే దీని ప్రధాన ఉద్దేశమన్నారు. దీని ద్వారా రీసెర్చ్ స్కాలర్స్‌కు సామాజిక అవసరాలకు అనుగుణంగా అధ్యయనాలు చేపట్టే అవకాశం ఏర్పడుతుందన్నారు. రిజిస్ట్రార్ ప్రొఫెసర్ రజని, స్కూల్ ఆఫ్ సైన్సెస్ డీన్ ప్రొఫెసర్ సుజాత, రెయిన్‌బో ఆగ్రోవెట్ సెరీ టెక్ ప్రైవేట్ లిమిటెడ్ మేనేజింగ్ డైరెక్టర్ టీవీ సుబ్బారాయుడు, సెరికల్చర్ విభాగాధిపతి ప్రొఫెసర్ మమత, అధ్యాపకులు సావిత్రి, విజయకుమారి పాల్గొన్నారు.

భూసేకరణ వేగవంతం



జాతీయ రహదారుల సమీక్షలో కలెక్టర్ లక్ష్మీశ, జేసీ శుభం భన్సల్

తిరుపతి అర్బన్: జాతీయ రహదారుల నిర్మాణానికి అవసరమైన భూసేకరణ ప్రక్రియ వేగవంతం చేస్తున్నట్టు కలెక్టర్ జీ.లక్ష్మీశ తెలిపారు. గురువారం జాతీయ రహదారులకు సంబంధించిన భూసేకరణ ప్రక్రియపై రవాణా, రహదారులు – భవనాల సెక్రటరీ ప్రద్యుమ్న అమరావతి నుంచి వర్చువల్ విధానంలో కలెక్టర్లతో సమీక్షించారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ జాతీయ రహదారులకు అవసరమయ్యే ప్రభుత్వ భూములు అవసరం మేరకు సేకరిస్తున్నట్టు వివరించారు. అనంతరం మధ్యాహ్నం రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి డాక్టర్ కేఎస్.జవహర్‌రెడ్డి విజవాడ నుంచి రెవెన్యూతోపాటు అటవీశాఖాధికారులతో వర్చువల్ విధానంలో సమీక్ష సమావేశం నిర్వహించారు. పెండింగ్ పనులు పూర్తి చేయాలని ఆదేశించారు. సాయంత్రం మరోమారు ఆయన జిల్లాలో రీసర్వేతో పాటు ఇనామ్, అసైన్డ్ భూములు, ల్యాండ్ రిక్వైర్మెంట్, హౌసింగ్, ఆరోగ్యం, వైద్యం, కుటుంబ సంక్షేమం, జగనన్న ఆరోగ్య సురక్ష, ఆరోగ్యశ్రీ తదితర అంశాలపై సమీక్షించారు.

బాధ్యతల స్వీకరణ



కనసం నరసింహారావు, కలెక్టరేట్ అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్

తిరుపతి అర్బన్: తిరుపతి కలెక్టరేట్ అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్‌గా కనసం నరసింహారావు బాధ్యతలు స్వీకరించారు. నంద్యాల జిల్లా కలెక్టరేట్‌లో పని చేస్తున్న ఆయన్ని తిరుపతి జిల్లాకు బదిలీ చేశారు. సార్వత్రిక ఎన్నిల నేపథ్యంలో పలు విభాగాలకు చెందిన అధికారులను ప్రభుత్వం బదిలీ చేసింది. ఈ క్రమంలో ఇప్పటికే 31 మంది తహసీల్దార్లు రెండు రోజుల క్రితం బదిలీపై తిరుపతి జిల్లాకు విచ్చేశారు. ఈ మేరకు వారు బాధ్యతలు స్వీకరిస్తున్నారు.


మరో తొమ్మిది మంది

తాజాగా జిల్లాలో మరో తొమ్మిది మంది తహసీల్దార్లు బాధ్యతలు చేపట్టారు. ఇందులో సూళ్లూరుపేట తహసీల్దార్‌గా కేవీ.గోపాలకృష్ణ, తడ తహసీల్దార్‌గా సయద్య్ ఇక్బల్, నాయుడుపేట తహసీల్దార్ కే.కల్యాణి తోపాటు.. ఓజిలి తహసీల్దార్ ఏ.శివరామసుబ్బయ్యను తొట్టంబేడుకు, బీఎన్‌కండ్రిగ తహసీల్దార్ ఎం.బాలక్రిష్ణను ఎర్రావారిపాలెంకు, రేణిగుంట తహసీల్దార్ ఎంవీఎస్.నారాయణరెడ్డిని తిరుపతి అర్బన్‌కు, తిరుపతి అర్బన్ తహసీల్దార్ ఏ.నాగేశ్వరరావును రేణిగుంటకు బదిలీ చేశారు. నాగలాపురం తహసీల్దార్ ప్రసన్నకుమార్‌ను తిరుపతి ఆర్డీఓ కార్యాలయానికి బదిలీ చేశారు. అక్కడ పనిచేస్తున్న సయ్యద్ అహ్మద్‌ను గూడూరు ఆర్డీఓ కార్యాలయానికి బదిలీచేశారు.

విద్యార్థులకు జగనన్న దీవెన



విదేశీ విద్య నేటి విద్యార్థుల కల. సామాన్య కుటుంబాలకు అది ఎండమావే. రూ.లక్షలు ఖర్చు చేయాల్సిరావడమే ఇందుకు కారణం. అదీ పేద విద్యార్థులు విదేశాల్లో చదవాలంటే అంత తేలిక కాదు. వారి జీవితాల్లో అసాధ్యమనుకున్న ఘనతను వారి ప్రతిభ ద్వారా సుసాధ్యం చేస్తోంది వైఎస్సార్ సీపీ ప్రభుత్వం. బడుగు, బలహీన వర్గాల యువత చిరకాల స్వప్నం జగనన్న (విదేశీ విద్యా) దీవెనతో సాధ్యమవుతోంది.



జగనన్న విదేశీ విద్యాదీవెన మెగా చెక్కు అందజేస్తున్న ప్రజాప్రతినిధులు, అధికారులు (ఫైల్)

- అన్ని వర్గాలకు అందుబాటులో విదేశీ విద్య
- బాబు పాలనలో కంటితుడుపుగా విదేశీ విద్యావకాశాలు
- పేద విద్యార్థుల తలరాత మార్చిన జగనన్న
- చిత్తూరు, తిరుపతి జిల్లాల్లో రూ.7.03 కోట్లు ఖర్చు

చిత్తూరు కలెక్టరేట్ : విదేశీ విద్య పేదలకు దుర్లభం. ఎందుకంటే రూ.లక్షల ఫీజులు, ఇతర ఖర్చులు చెల్లించాల్సి ఉంటుంది. దీంతో పేద విద్యార్థులు తమ ఆశలను వదులుకునే వారు. ఈ విషయం గుర్తించిన వైఎస్సార్ సీపీ సర్కారు జగనన్న విదేశీ విద్యాదీవెన పథకం అమలు చేసి, పేద విద్యార్థులకు అండగా నిలిచింది. ఈ పథకంతో అంతర్జాతీయ యూనివర్సిటీల్లో ఉచితంగా విద్యాభ్యాసం చేసే అవకాశాన్ని సీఎం జగన్‌మోహన్‌రెడ్డి కల్పించారు. దీంతో చిత్తూరు, తిరుపతి జిల్లాల్లో పలువురు పేదలు విదేశాల్లో ఉన్నత విద్యను అభ్యసిస్తున్నారు.

నాడు మోసం

టీడీపీ హయాంలో పేద విద్యార్థులు విదేశాల్లో చదవాలంటే కుదరని పరిస్థితి. చంద్రబాబు పాలనలో విదేశీ విద్యా పథకం అమలు చేసినప్పటికీ ఒకరిద్దరికి మాత్రమే అవకాశం కల్పించేవారు. ఆ ఇద్దరు కూడా జన్మభూమి కమిటీల సిఫార్సులు, ఒకే సామాజిక వర్గానికి చెందిన వారే. ఉమ్మడి చిత్తూరు జిల్లాలో 2019కి ముందు విదేశీ విద్య మిథ్యగా మిగిలింది.

నేడు న్యాయం

పేద విద్యార్థులు ఉన్నత చదువులు చదివేలా వైఎస్సార్ సీపీ పాలనలో జగనన్న విదేశీ విద్యాదీవెన పథకాన్ని ప్రారంభించారు. ఈ పథకానికి అర్హులైన విద్యార్థులు నేరుగా ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకునే అవకాశాన్ని కల్పించారు. అన్ని సామాజిక వర్గాల్లో విద్యార్థులను విదేశాల్లో విద్యనభ్యసించేందుకు వెసులుబాటు కల్పించారు. విదేశాల్లో చదవాలనుకునే పేద విద్యార్థుల కలను సీఎం వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి నెరవేర్చారు. ఉమ్మడి జిల్లాలో విద్యార్థులకు విదేశాల్లోని టాప్ యూనివర్సిటీల్లో చదివే అవకాశం కల్పించి, వారి తలరాత మార్చారు.

అన్ని సామాజిక వర్గాలకు లబ్ధి

జగనన్న విదేశీ విద్యాదీవెన పథకంతో అన్ని సామాజిక వర్గాలకు మేలు చేకూర్చింది. చిత్తూరు, తిరుపతి జిల్లాల్లో ఈ పథకానికి దరఖాస్తు చేసుకున్న విద్యార్థులకు వైఎస్సార్ సీపీ సర్కారు ఆర్థిక సహాయం అందజేసి మేలు చేసింది.

రూ.7.03 కోట్లు ఖర్చు

విదేశీ విద్యాదీవెన పథకానికి రాష్ట్ర ప్రభుత్వం చిత్తూరు, తిరుపతి జిల్లాలో రూ.7.03 కోట్లు ఖర్చు చేసింది. బీసీ, ఈబీసీ, కాపు, ఎస్సీ, ఎస్టీ, మైనారిటీ విద్యార్థులకు ఈ పథకంలో మేలు చేకూర్చారు. జగనన్న విదేశీ విద్యాదీవెన పథకంతో చిత్తూరు జిల్లాలో 17 మంది, తిరుపతి జిల్లాలో 13 మంది విద్యార్థులు విదేశాల్లో విద్యనభ్యసిస్తున్నారు. చిత్తూరు జిల్లాలో 17 మందికి రూ.3.69 కోట్లు, తిరుపతి జిల్లాలో 13 మందికి రూ.3.34 కోట్లు మొత్తం రూ.7.03 కోట్లు ప్రభుత్వం ఖర్చు చేసింది. ఆ విద్యార్థులు చదువు పూర్తి చేసేందుకు అవసరమైన అన్ని ఏర్పాట్లు రాష్ట్ర ప్రభుత్వం సమకూరుస్తోంది.

ఊహించ లేదు



నాకు విదేశాల్లో చదివే అవకాశం వస్తుందని ఊహించలేదు. నేను తిరుపతి జిల్లా కేంద్రంలోని ఎస్‌డీహెచ్‌ఆర్ డిగ్రీ కళాశాలలో చదివాను. మాది వ్యవసాయ కుటుంబం. నాన్న వ్యవసాయం చేస్తూ డిగ్రీ వరకు చదివించారు. ఆపై చదువులు చదివించాలంటే కుదరని పని. ఆ దశలో జగనన్న విద్యాదీవెన పథకంతో డిగ్రీ పూర్తి చేశాను. ఆ తరువాత విదేశీ విద్యాదీవెన పథకానికి దరఖాస్తు చేసుకుని ఎంపికయ్యాను. ప్రస్తుతం విదేశాల్లో పీజీ చదువుతున్నాను. సీఎం అమలు చేసిన విదేశీ విద్యాదీవెన పథకం నగదు నాకు సక్రమంగా అందుతోంది. నా విదేశీ విద్య సీఎం జగన్ మోహన్‌రెడ్డి చేసిన మేలు వల్లే.

– అనిత, తిరుపతి జిల్లా

సీఎం పుణ్యమే



విదేశాల్లో చదవాలంటే రూ.లక్షలు ఉండాల్సిందే. వ్యవసాయ కుటుంబానికి చెందిన మాకు అంత స్థోమత లేదు. నేను డిగ్రీ వరకు తిరుపతి జిల్లాలో చదువుకున్నాను. తల్లిదండ్రులు డిగ్రీ వరకు ఎంతో కష్టపడి చదివించారు. ఆపై చదువుల భారం తల్లిదండ్రులు భరించే పరిస్థితుల్లో లేరు. ఇలాంటి పరిస్థితుల్లో పీజీ చేరే స్థోమత లేక చదువు మానేద్దామని అనుకున్నాను. అయితే జగనన్న విదేశీ విద్యాదీవెన పథకానికి దరఖాస్తు చేసుకోగానే ఎంపికయ్యాను. ఈ పథకం నాకు వరంలాగా మారింది. గతంలో ఏ నాయకుడూ చేయని సాయం, సీఎం జగనన్న మా కోసం చేశారు. ప్రస్తుతం విదేశాల్లో చదువుకుంటున్నానంటే అది సీఎం పుణ్యమే.

– సుభాషిణి, తిరుపతి జిల్లా

నాకు భవిష్యత్తును ఇచ్చారు



నా తండ్రి రైతు. ఐరాల మండలానికి చెందిన నేను అమెరికాలో చదువుకుంటానని కలలో కూడా అనుకోలేదు. అయితే జగనన్న విదేశీ విద్యా దీవెన పథకంతో నాకు భవిష్యత్తు కల్పించారు. ప్రభుత్వం విదేశీ విద్యాదీవెన పథకాన్ని ప్రారంభించగానే దరఖాస్తు చేసుకున్నాను. ఏ అధికారి వద్దకు వెళ్లకుండానే పథకానికి నేను అర్హత పొందాను. అమెరికాలోని బ్రూక్లిన్‌లో ఉన్న న్యూయార్క్ యూనివర్సిటీలో కంప్యూటర్ ఇంజినీరింగ్ కోర్సులో అడ్మిషన్ దొరికింది. త్వరలో విదేశాల్లోకి వెళుతున్నాను. నా భవితకు బంగారు బాటలు వేసిన జగనన్నకు నేను రుణపడి ఉంటాను. సీఎం చేసిన మేలు ఎప్పటికీ మరువలేనిది.

– పూజిత, ఐరాల మండలం, చిత్తూరు జిల్లా

జగనన్న దేవుడు



నాది రాష్ట్ర సరిహద్దులోని నగరి మండలం రామాపురం అనే చిన్న గ్రామం. మాది వ్యవసాయ కుటుంబం. నా తండ్రి చంద్రశేఖర్ నాయుడు రైతు, తల్లి వాణి గృహిణి. మా ఆర్థిక స్థోమత అంతంత మాత్రమే. విదేశాల్లో మాస్టర్ ఆఫ్ డేటాసైన్స్ చదవాలన్నది నా కల. విదేశీ విద్యకయ్యే ఖర్చు మా కుటుంబానికి పెద్ద భారం. ఈ క్రమంలో విదేశీ విద్యాదీవెన పథకం నోటిఫికేషన్ రావడంతో దరఖాస్తు చేసుకుని ఎంపికయ్యాను. నాకు రూ.55 లక్షలు విదేశీ విద్యాదీవెన కింద ప్రభుత్వం చెల్లించింది. ఆస్ట్రేలియా మెల్‌బోర్న్‌లోని మొనాస్ట్ యూనివర్సిటీలో నాకు అడ్మిషన్ వచ్చింది. సీఎం జగన్‌మోహన్‌రెడ్డి నాకు వరం ఇచ్చి, నా పాలిట దేవుడయ్యారు.

– చంద్రసాయికృష్ణ, రామాపురం, నగరి మండలం

రూ.30 లక్షలు ఇచ్చారు



మాది చిత్తూరు జిల్లా తవణంపల్లి మండలం గురుకులవారిపల్లె. నాన్న రమాకాంత్ చౌదరి, తల్లి జలజ. చిన్నప్పటి నుంచి విదేశాల్లో చదవాలన్నది నా కోరిక. బీటెక్ వరకు చదువుకున్నాను. ఆ తర్వాత విదేశాల్లో చదవాలంటే అంత స్థోమత మా తల్లిదండ్రులకు లేదు. సీఎం జగన్‌మోహన్‌రెడ్డి సర్ అమలు చేసిన విదేశీ విద్యాదీవెన పథకంలో అమెరికాలో ఎంఎస్ చేసే అదృష్టం నాకు దక్కింది. నా చదువుకు అవసరమైన డబ్బులు ప్రభుత్వమే ఇస్తోంది. ఇప్పటివరకు నా చదువుకు అవసరమైన రూ.30 లక్షలు ప్రభుత్వం అందజేసింది. సీఎం సార్‌కి రుణపడి ఉంటాను. – నిషిత, విద్యార్థిని, తవణంపల్లె, చిత్తూరు జిల్లా

మేలు మరువలేనిది



మాది గుడిపాల మండలం బొమ్మసముద్రం. మాది మధ్య తరగతి కుటుంబం. నేను చిరువ్యాపారం చేస్తుంటాను. మా పిల్లలను విదేశాల్లో చదివించే స్థోమత మాకు లేదు. అయితే మా పాప రమ్యశ్రీ జగనన్న విదేశీ విద్యాదీవెన పథకానికి అర్హత పొందింది. దీంతో లండన్‌లోని వార్మిక్ యూనివర్సిటీలో విద్యనభ్యసించే అదృష్టం మాపాపకు దక్కింది. మాకన్నా మా పిల్లల భవిష్యత్ గురించి సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డే ఎక్కువగా ఆలోచిస్తున్నారు. గతంలో ఏ ముఖ్యమంత్రీ ఇంతలా మేలు చేయలేదు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా సంక్షేమ పథకాలను చేరువచేస్తోంది.

– భానుప్రకాష్, విద్యార్థిని తండ్రి, బొమ్మసముద్రం, గుడిపాల మండలం

పీహెచ్‌డీ కోర్సుకు సాయం



మాది రైతు కుటుంబం. నేను ఇంజినీరింగ్ వరకు పూతలపట్టులోని వేము ఇంజినీరింగ్ కళాశాలలో చదువుకున్నాను. ఆ తర్వాత విదేశాల్లో పీహెచ్‌డీ చదువుకోవాలన్నది నా ఆశ. విదేశాల్లో పీహెచ్‌డీ చదివించే స్థోమత మా తల్లిదండ్రులకు లేదు. ఇలాంటి సమయంలో రాష్ట్ర ప్రభుత్వం అమలు చేసిన విదేశీ విద్యాదీవెన పథకం నాకు వరంలా మారింది. ఈ పథకంలో ఇటలీలోని బొలోగ్నా యూనివర్సిటీలో పీహెచ్‌డీ చేసే అవకాశం దక్కింది. నా కోర్సుకు అయ్యే ఖర్చును ప్రభుత్వం అందజేస్తోంది. ఇప్పటి వరకు రూ.4 లక్షలు అందజేసింది. నేను విదేశాల్లో పీహెచ్‌డీ చదువుతున్నానంటే సీఎం జగన్ సార్ వల్లే.

– మమత, పూతలపట్టు మండలం, చిత్తూరు జిల్లా

సీఎం దయతోనే విదేశీ విద్య



మాది సూళ్లూరుపేట. నేను ప్రైవేట్ బ్యాంకులో పనిచేస్తున్నాను. నా బిడ్డను విదేశాల్లో చదివించే స్థోమత లేదు. అయితే ఏ నాయకుడు సిఫార్సు లేకుండా రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న జగనన్న విదేశీ విద్యా దీవెన పథకానికి నా కుమారుడు పవన్ కుమార్ ఎంపికయ్యాడు. దీంతో నా కొడుకు ప్రస్తుతం అమెరికాలో కంప్యూటర్ అనాలసిస్ట్ కోర్సు చేస్తున్నాడు. అబ్బాయిని కంప్యూటర్ అనాలిసిస్ కోర్సు పూర్తి చేయించడం ఎలా అన్న పరిస్థితుల్లో జగనన్న విదేశీ విద్యా దీవెన పథకం ద్వారా రూ.12.50 లక్షలు ప్రభుత్వం ఆర్థిక సాయం చేసింది. మా ఇంటిల్లిపాది సీఎం జగన్ మోహన్ రెడ్డికి రుణపడి ఉంటాం.

– ప్రవీణ్‌కుమార్, విద్యార్థి తండ్రి, సూళ్లూరుపేట, తిరుపతి జిల్లా

గతంలో ఏ నాయకుడూ మేలు చేయలేదు



నేను కూరగాయల వ్యాపారం చేస్తుంటాను. మాది బీసీ కులం. నా కుమార్తె రుచితకు విదేశీ విద్యాదీవెన పథకంతో విదేశాల్లో చదివే అవకాశం దక్కింది. కూరగాయల వ్యాపారం చేసుకునే నేను మా పాపను విదేశాల్లో చదివిస్తానని కలలో కూడా అనుకోనేలేదు. ఈ పథకంలో ఎంపికైన నా కుమార్తె ఆస్ట్రేలియాలోని మొనాష్ యూనివర్సిటీలో ఎంఎస్ చదువుతోంది. ఇందుకోసం రూ.13.94 లక్షలను ప్రభుత్వం ఖర్చు చేస్తోంది. ఇప్పటి వరకు పేద పిల్లల కోసం జగన్‌మోహన్‌రెడ్డి లాగా మేలు చేసిన నాయకుడు ఎవరూ లేరు. ఆయన చేసిన మేలు ఎప్పటికీ మరిచిపోము.

– వరాలు, విద్యార్థిని తండ్రి, చిత్తూరు

పర్యాటక అభివృద్ధికి కమిటీలు ఎక్కడ?

- కేంద్రాన్ని నిలదీసిన ఎంపీ గురుమూర్తి

సూళ్లూరుపేట: తిరుపతి జిల్లా ప్రపంచ పర్యాటక కేంద్రంగా అభివృద్ధి చెందడానికి అన్ని రకాల అవకాశాలు ఉన్నాయని, అయితే కేంద్ర ప్రభుత్వ నిర్లక్ష్యంతో ఎక్కడ వేసిన గొంగళి అక్కడే అన్న చందంగా ఉందని ఎంపీ గురుమూర్తి ధ్వజమెత్తారు. ఈ మేరకు గురువారం పార్లమెంట్ వేదికగా కేంద్రానికి పలు ప్రశ్నలు సంధించారు. ఆధ్యాత్మికంగా, సాంస్కృతిక వారసత్వంతో తిరుపతి జిల్లా ప్రతి ఏటా మిలియన్ల మంది పర్యాటకులను ఆకర్షిస్తోందన్నారు. ప్రస్తుతం తిరుపతి జిల్లాలో ప్రపంచ ప్రసిద్ధి చెందిన శ్రీహరికోట రాకెట్ ప్రయోగ కేంద్రం, పులికాట్ సరస్సు, ప్రఖ్యాత వైద్య, శాస్త్రీయ సంస్థలకు నిలయంగా విరాజిల్లుతోందని వివరించారు. జిల్లా



మాట్లాడుతున్న ఎంపీ గురుమూర్తి

పరిధిలో ఉన్న వనరులన్నింటినీ వినియోగించుకుని తిరుపతి జిల్లాను పర్యాటకపరంగా అభివృద్ధి చేయాల్సిన అవసరం ఉందన్నారు. కేంద్రంలోని వివిధ శాఖల ఆధ్వర్యంలో ఒక సమన్వయ కమిటీని ఏర్పాటు చేయాలని కోరారు. తిరుపతిలో పర్యాటక అభివృద్ధికి, పర్యావరణ వ్యవస్థలో ప్రయివేట్ పరిశ్రమ వృద్ధికి దోహదపడేలా 5 నుంచి 10 సంవత్సరాల మాస్టర్‌ప్లాన్, సహకార పథకాన్ని రూపొందించేందుకు అవసరమైన వనరులు, నిధులు కమిటీ కేటాయించాలని కోరారు.

సమస్యలు తెలియజేయండి



కలెక్టర్‌కు పుష్పగుచ్ఛం అందిస్తున్న డీపీటీఓ చెంగల్‌రెడ్డి



ఎన్నికల కౌంటింగ్ డెమో కేంద్రాన్ని పరిశీలిస్తున్న కలెక్టర్

తిరుపతి అర్బన్: ఉద్యోగులకు ఏవైనా సమస్యలుంటే తెలియజేయాలని కలెక్టర్ లక్ష్మీశ తెలిపారు. ఈ మేరకు ఆయన డీఆర్వో పెంచల కిషోర్‌తో కలిసి కలెక్టరేట్‌లోని పలు సెక్షన్లను పరిశీలించారు. సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో ఉద్యోగులు సైనికుల వలే పనిచేయాలని చెప్పారు. రికార్డులు క్రమపద్ధతిలో ఉంచుకోవాలని చెప్పారు. అనంతరం ఆయన ఎస్వీ యూనివర్సిటీలో ఎన్నికల కౌంటింగ్ డెమో కేంద్రం ఏర్పాట్లు పరిశీలించారు. అక్కడి నుంచి కలెక్టరేట్‌కు విచ్చేసి ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ వారి నేతృత్వంలో గాక్–గోజర్మనీ వారి సంయుక్త పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఏఎన్ఎం, జీఎన్ఎం, బీఎస్సీ, ఎమ్మెస్సీ నర్సింగ్ చదువుతున్న వారికి జర్మనీ భాష నేర్పించి, జర్మనీలో నర్సెస్‌గా పనిచేయడానికి అవకాశం కల్పించనున్నట్లు వెల్లడించారు. పూర్తి వివరాలకు కలెక్టరేట్ కార్యాలయంలో సంప్రదించాలని కోరారు. డీఆర్‌డీఏ పీడీ జ్యోతి, నైపుణ్యాభివృద్ధి సంస్థ జిల్లా అధికారి లోకనాథం పాల్గొన్నారు. ఆ తర్వాత సమస్యలు పరిష్కరించాలని మధ్యాహ్న భోజన కార్మికులు కలెక్టర్‌కు విన్నవించారు. డీపీటీఓ చెంగల్‌రెడ్డి, డెప్యూటీ సీటీఎం భాస్కర్‌రెడ్డి కలెక్టర్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు.

ప్రజా సంక్షేమ సారథి సీఎం జగన్

- రాష్ట్ర హోం మంత్రి తానేటి వనిత వెల్లడి

తిరుపతి కల్చరల్: అశేష ప్రజాదరణతో ముఖ్యమంత్రి అయిన జగన్ ఇచ్చిన మాట మేరకు రాష్ట్ర ఆర్థిక పరిస్థితి ఎలా ఉన్నా అనేక పథకాలను అమలు చేసి ప్రజా సంక్షేమానికి బాటలు వేశారని రాష్ట్ర హోం మంత్రి తానేటి వనిత తెలిపారు. తిరుమల పర్యటనలో భాగంగా తిరుపతికి విచ్చేసిన మంత్రి సంప్రదాయబద్ధంగా గురువారం సాయంత్రం శ్రీతాతయ్యగుంట గంగమ్మను దర్శించుకున్నారు. ఆలయం వద్దకు చేరుకున్న మంత్రికి ఆలయ అర్చకులు, సిబ్బంది పూర్ణకుంభ స్వాగతం పలికి అమ్మవారి దర్శనం ఏర్పాటు చేశారు. వేయి కళ్ల దుత్తను మంత్రి నెత్తిన పెట్టుకొని ఆలయ ప్రదక్షిణ చేసి మొక్కు చెల్లించుకున్నారు. గంగమ్మ తల్లి పాదాలపై ఉప్పు పోసిన అనంతరం అమ్మవారిని



గంగమ్మ తల్లి సేవలో రాష్ట్ర హోం శాఖ మంత్రి తానేటి వనిత

దర్శించుకున్నారు. మంత్రికి ఆలయ అర్చకులు, సిబ్బంది అమ్మవారి సారె, తీర్థప్రసాదాలను అందజేశారు. అనంతరం హోం మంత్రి మీడియాతో మాట్లాడుతూ వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ఏర్పాటు అయిన తర్వాత కొద్ది నెలల్లోనే కరోనా విపత్తు రావడంతో ప్రపంచం అతలాకుతలమైపోయినా, రాష్ట్రంలో సంక్షోభాన్ని దీటుగా ఎదుర్కొన్న వ్యక్తి జగనన్న అని తెలిపారు. ఇదే సమయంలో వలంటీర్, సచివాలయ వ్యవస్థను తీసుకొచ్చి దళారీలను సమూలంగా అరికట్టి ప్రజల మన్ననలు అందుకున్నారని చెప్పారు. వ్యవసాయం దండగ అని చెప్పిన నాయకులు ఎన్నికల వేళ ప్రజల్లోకి వస్తున్నారని చెప్పారు. సంక్షేమ పథకాలు అందించిన గతంలో వైఎస్.రాజశేఖర్‌రెడ్డిని ప్రజలు గుండెల్లో పెట్టుకున్నారని గుర్తు చేశారు. అదేవిధంగా జగనన్నను ఆదరిస్తున్నారని తెలిపారు. ప్రజలు, కార్యకర్తలు, నాయకులు ఇచ్చిన ధైర్యంతోనే వైఎస్సార్‌సీపీ ఒంటరిగా 175 స్థానాల్లో పోటీ చేస్తోందన్నారు. జనసేన, టీడీపీ పొత్తు పట్ల విలేకరులు అడిగిన ప్రశ్నలకు మంత్రి సమాధానం చెబుతూ రాజు బలవంతుడైతే శత్రువులందరూ ఒక్కటవుతారని తెలిపారు.

నేటి నుంచి విధులకు

తిరుపతి లీగల్: తిరుపతి న్యాయవాదులు శుక్రవారం నుంచి విధులకు హాజరు కావాలని గురువారం ఏకగ్రీవంగా తీర్మానించారు. తిరుపతి న్యాయవాదుల అసోసియేషన్ హాల్లో సర్వసభ్య సమావేశం జరిగింది. భూ హక్కు చట్టాన్ని వ్యతిరేకిస్తూ న్యాయవాదులు సుమారు రెండు నెలలుగా విధులకు హాజరు కాకుండా వివిధ రూపాల్లో నిరసన తెలియజేస్తూ వచ్చారు. ఈ మేరకు శుక్రవారం నుంచి న్యాయవాదులు విధులకు హాజరు కావాలని తీర్మానించారు. అయితే టీడీపీ లీగల్ సెల్‌కు చెందిన కొంత మంది న్యాయవాదులు నిరసన కొనసాగించాలంటూ వివిధ రకాలుగా ప్రయత్నాలు చేశారు. అయితే ఎక్కువ మంది న్యాయవాదులు దీనికి ఒప్పుకోకపోవడంతో చేసేది లేక వారు మిన్నకుండి పోయారు. సమావేశంలో తిరుపతి న్యాయవాదుల సంఘం అధ్యక్షుడు వెంకటకుమార్, ఉపాధ్యక్షుడు గోపీచంద్, ఇతర కార్యవర్గ సభ్యులు పాల్గొన్నారు.

నేషనల్ వర్క్‌షాప్ ప్రారంభం

తిరుపతి సిటీ : పద్మావతి మహిళా వర్సిటీ డిపార్ట్‌మెంట్ ఆఫ్ బయోసైన్స్ అండ్ సెరికల్చర్ ఆధ్వర్యంలో గురువారం జీవవైవిధ్యం, క్లిష్టమైన పరిశీలన అనే అంశంపై రెండు రోజుల జాతీయ వర్క్‌షాపు ప్రారంభమైంది. ప్రొఫెసర్ డీ.మమత ముఖ్యఅతిథిగా విచ్చేసి వన్య ప్రాణుల సంరక్షణ, పక్షులు, క్షీరదాల సంరక్షణలో తీసుకోవలసిన ప్రధాన అంశాలను ప్రస్తావించారు.

నేడు బ్రహ్మోత్సవాలకు అంకురార్పణ

తిరుపతి(అలిపిరి): వైఎస్సార్ జిల్లా దేవుని కడపలోని శ్రీలక్ష్మీ వేంకటేశ్వరస్వామివారి ఆలయంలో ఫిబ్రవరి 10 నుంచి 18వ తేదీ వరకు నిర్వహించనున్న వార్షిక బ్రహ్మోత్సవాలకు ఈనెల 9వ తేదీ శుక్రవారం సాయంత్రం 6 నుంచి రాత్రి 9 గంటల మధ్య అంకురార్పణ జరగనుందని టీటీడీ ఈవో ఏవీ ధర్మారెడ్డి తెలిపారు. 10న ఉదయం 10.30 గంటలకు ధ్వజారోహణంతో బ్రహ్మోత్సవాలు ప్రారంభం కానున్నాయని చెప్పారు. 15న ఉదయం స్వామివారి కల్యాణోత్సవం ఉంటుందన్నారు. ఇందులో పాల్గొనే గృహస్తులు (ఇద్దరు) రూ.300 చెల్లించాల్సి ఉంటుందని తెలిపారు. 19న సాయంత్రం 6 గంటలకు నిర్వహించే పుష్పయాగానికి భక్తులు పుష్పాలను సమర్పించవచ్చన్నారు.



జనం గుండెల్లో జత కట్టడమే జగనన్న ఎజెండా





సంక్షేమ పథకాల బోర్డు ఆవిష్కరిస్తున్న చంద్రగిరి నియోజకవర్గ సమన్వయకర్త మోహిత్‌రెడ్డి వై ఏపీ నీడ్స్ జగన్ కరపత్రాలను ఆవిష్కరిస్తున్న చెవిరెడ్డి మోహిత్‌రెడ్డి

- ప్రజలే కుటుంబంగా ఎమ్మెల్యే చెవిరెడ్డి సేవా కార్యక్రమాలు
- వై ఏపీ నీడ్స్ జగన్ కార్యక్రమంలో తుడా చైర్మన్ చెవిరెడ్డి మోహిత్‌రెడ్డి

రామచంద్రాపురం: 'జెండాలు జత కట్టడమే వాళ్ల ఎజెండా అయితే.. జనం గుండెల్లో జత కట్టడమే జగనన్న ఎజెండా' అని తుడా చైర్మన్, చంద్రగిరి నియోజకవర్గ సమన్వయకర్త చెవిరెడ్డి మోహిత్‌రెడ్డి స్పష్టం చేశారు. గురువారం ఆయన వై ఏపీ నీడ్స్ జగన్ కార్యక్రమంలో భాగంగా మండలంలోని మిట్టకండ్రిగ, కుప్పంబాదూరు, సీకాలేపల్లి, నెత్తకుప్పం, అనుప్పల్లి పంచాయతీల్లో పర్యటించారు. స్థానికులు అడుగడుగునా నీరాజనాలు పట్టారు. హారతులు పట్టి, టపాకాయలు పేల్చి అపూర్వ స్వాగతం పలికారు. అనంతరం ఆయా గ్రామాల్లో దివంగత మహానేత వైఎస్.రాజశేఖరరెడ్డి విగ్రహాలకు పూల మాలలు వేసి నివాళులర్పించారు. సంక్షేమ బోర్డులు ఆవిష్కరించారు. బైక్ ర్యాలీగా వచ్చి మోహిత్‌రెడ్డికి యువకులు స్వాగతం పలికారు.

బడుగు, బలహీన వర్గాలకు ప్రాధాన్యం

ఈ నాలుగున్నరేళ్ల సీఎం జగనన్న పాలనలో కీలక సంస్కరణలకు శ్రీకారం చుట్టారని మోహిత్‌రెడ్డి కొనియాడారు. బడుగు, బలహీన వర్గాలకు ప్రాధాన్యం ఇస్తూ వారి ఆర్థిక పురోగతికి సంక్షేమ ఫలాలు అందించారని చెప్పారు. డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ స్ఫూర్తితో ముందుకు సాగుతున్నట్లు వెల్లడించారు. సంక్షేమం, అభివృద్ధి రెండు కళ్లుగా భావించి రాష్ట్రంలో జనరంజక పాలన కొనసాగిస్తున్నారని తెలిపారు. అర్హతే ప్రామాణికంగా సంక్షేమ పథకాలు అందిస్తున్న ఏకైక సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మాత్రమేనని ప్రశంసించారు. నాణ్యమైనవిద్య, వైద్యం, మెరుగైన పోషణ, జీవనోపాధి కల్పించేందుకు కృషి చేస్తున్నట్లు తెలిపారు. ఎన్నికల మేనిఫెస్టోలో ఇచ్చిన హామీలను 99 శాతం అమలు చేసిన ఘనత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వానికే దక్కుతుందన్నారు. 2024 సార్వత్రిక ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీని అఖండ మెజారిటీతో గెలిపించాలని ఆయన ప్రజలకు పిలుపునిచ్చారు. అనంతరం కుప్పంబాదూరు, నెత్తకుప్పం, కొత్త వేపకుప్పంలో సచివాలయ భవనాలు, రైతు భరోసా కేంద్రాలు, ఆరోగ్య కేంద్రం, వాటర్ ప్లాంట్, ఆర్వో ప్లాంట్లను ఆయన ప్రారంభించారు. కార్యక్రమంలో పలువురు నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఆగమోక్తంగా గురుదక్షిణామూర్తికి పూజలు



విశేషాలంకరణలో గురుదక్షిణామూర్తి

శ్రీకాళహస్తి: శ్రీకాళహస్తీశ్వరాలయంలో వెలసిన మేథో గురుదక్షిణామూర్తికి గురువారం ఆగమోక్తంగా పూజలు నిర్వహించారు. ముందుగా కలశ ప్రతిష్ఠ ఏర్పాటు చేశారు. అనంతరం వినాయక పూజ, కలశ పూజ, వైదిక క్రతువులు నిర్వహించారు. స్వామివారికి పాలు, పెరుగు, పంచామృతం, చందనం, నారికేళ జలాలతో వైభవంగా అభిషేకం నిర్వహించారు. స్వామివారిని సుగంధ పుష్పాలు, స్వర్ణాభరణాలతో విశేషంగా అలంకరించి ధూప, దీప నైవేద్యాలు సమర్పించారు. పర్వత హారతి, చక్ర హారతి, కుంభ హారతి, మహా మంగళహారతులు ఇచ్చారు. భక్తులు పెద్దసంఖ్యలో స్వామివారిని దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు. కార్యక్రమంలో పాలకమండలి చైర్మన్ అంజూరు తారక శ్రీనివాసులు, పాలకమండలి సభ్యులు, ఆలయ అధికారులు, వేదపండితులు తదితరులు పాల్గొన్నారు.

నేడు విద్యార్థుల సక్సెస్ మీట్

తిరుపతి(అలిపిరి): తిరుపతి మహతి ఆడిటోరియంలో శుక్రవారం టీటీడీ విద్యార్థుల సక్సెస్ మీట్ ఉంటుందని టీటీడీ జేఈఓ సదాభార్గవి, డీఈఓ డాక్టర్ ఎం.భాస్కర్‌రెడ్డి తెలిపారు. టీటీడీ విద్యాసంస్థల్లో అకడమిక్స్, ఎన్‌సీసీ, ఎన్ఎస్ఎస్, స్పోర్ట్స్ అండ్ గేమ్స్, కల్చరల్, కో కరికులర్, కాంపిటీటివ్ ఎగ్జామ్స్ తదితర అంశాల్లో ఉత్తమ ప్రతిభ కనబరిచిన 240 మంది విద్యార్థులకు ఈ సందర్భంగా 5 గ్రాముల వెండి డాలర్, ప్రశంసా పత్రం అందజేయనున్నట్లు పేర్కొన్నారు.

టీడీపీ నుంచి వైఎస్సార్‌సీపీలో చేరిక



కండువాలు వేస్తున్న బియ్యపు పవిత్రారెడ్డి

ఏర్పేడు: మండలంలోని గుడిమల్లం ఎస్సీ కాలనీలో 60 మంది టీడీపీ నాయకులు, కార్యకర్తలు, మహిళలు వైఎస్సార్ సీపీలోకి చేరారు. కాలనీలో గురువారం వైఎస్సార్‌సీపీ రేణిగుంట మండల ఇన్‌చార్జ్ బియ్యపు పవిత్రారెడ్డి సార్వత్రిక ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఎస్సీ కాలనీలో టీడీపీకి చెందిన ప్రశాంత్, సంతోష్, హేమంత్, మునిరత్నం, విజయ, వెంకటమ్మ, ఆదెమ్మ, చెంగమ్మ, గంగాదేవి, పుష్ప, దేశమ్మ, సుబ్బరామయ్య, రాజ, కృష్ణయ్య, గోపీ, రాజేంద్ర తదితర 60 మంది నాయకులు, కార్యకర్తలు, మహిళలకు బియ్యపు పవిత్రారెడ్డి కండువాలు వేసి పార్టీలోకి ఆహ్వానించారు. వారు మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలనలో అమలవుతున్న సంక్షేమ పథకాలకు ఆకర్షితులై పార్టీలో చేరినట్లు చెప్పారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ మండల ఇన్‌చార్జ్ గున్నేరి కిషోర్‌రెడ్డి, వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు రమణయ్య యాదవ్, సర్పంచ్ సుబ్రమణ్యం, పరశురామేశ్వర స్వామి ఆలయ చైర్మన్ నరసింహ యాదవ్, కో-ఆప్షన్ సభ్యుడు బత్తిశెట్టి, వైఎస్సార్ సీపీ నాయకులు పాల్గొన్నారు.

నామసంకీర్తన భగవంతునికి ప్రీతికరం




హాజరైన భజన మండళ్ల సభ్యులు

తిరుమల: మానవులు సమస్యల వలయం నుంచి బయటపడేందుకు అనుసరించే నామ సంకీర్తన భగంవతునికి ప్రీతికరమని కర్ణాటకలోని కుక్కే సుబ్రమణ్యస్వామి మఠాధిపతి విద్యాప్రసన్నతీర్థ స్వామీజీ ఉద్ఘాటించారు. శ్రీపురందరదాసు ఆరాధన మహోత్సవాలు టీటీడీ దాససాహిత్య ప్రాజెక్టు ఆధ్వర్యంలో గురువారం తిరుమలలోని ఆస్థాన మండపంలో ఘనంగా ప్రారంభమయ్యాయి. ఇందులో విద్యాప్రసన్నతీర్థ స్వామీజీ ప్రసంగిస్తూ భగవంతుడిని చేరాలంటే ముందు ఆయన పరమభక్తుల అనుగ్రహం అవసరమన్నారు. ఈ కోవకు చెందిన శ్రీవారి పరమభక్తుడు శ్రీ పురందరదాసు అన్నారు. నేడు వేలాదిమంది భక్తులు పురందరదాసు రచించిన లక్షలాది కీర్తనలు ఆలపిస్తూ స్వామివారి కృపకు పాత్రులవుతున్నారని, ఇదే కలియుగంలో నామసంకీర్తనకున్న వైశిష్ట్యమన్నారు. దాససాహిత్యాన్ని విశ్వవ్యాప్తం చేస్తున్న భజన మండళ్ల సభ్యుల కృషిని కొనియాడారు. టీటీడీ దాససాహిత్య ప్రాజెక్టు ప్రత్యేకాధికారి శ్రీ ఆనందతీర్థాచార్యులు మాట్లాడుతూ, 4.75 లక్షల సంకీర్తనలు రచించడం దైవాంశ సంభూతుడు, సాక్షాత్తు నారద స్వరూపులైన శ్రీ పురందరదాసుకే సాధ్యమైందని తెలిపారు. అనంతరం స్వామీజీని శాలువ, శ్రీవారి ప్రసాదంతో సన్మానించారు. అంతకుముందు ఉదయం సుప్రభాతం, ధ్యానం, సామూహిక భజన, నగర సంకీర్తన కార్యక్రమాలు నిర్వహించారు. దాస సంకీర్తనలను భజన మండళ్ల సభ్యులు చక్కగా ఆలపించారు.

9న సంకీర్తనాలాపన : ఆరాధనోత్సవాల్లో రెండవ రోజు శుక్రవారం సంగీత, సాహిత్య రంగాలలో నిష్ణాతులైన యువ కళాకారులకు ప్రతిభ పురస్కారాలు అందజేయనున్నారు. అదేవిధంగా సాయంత్రం తిరుమల నారాయణగిరి ఉద్యానవనాలకు శ్రీవారి ఉత్సవమూర్తులను వేంచేపు చేసి శ్రీ పురందరదాస సంకీర్తనల బృందగానం నిర్వహిస్తారు. టీటీడీ దాససాహిత్యప్రాజెక్టు ప్రత్యేకాధికారి ఆనందతీర్థాచార్యులు ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో ఆంధ్రప్రదేశ్, తెలంగాణ, తమిళనాడు, కర్ణాటక రాష్ట్రాల నుంచి 3,500 మందికిపైగా భజనమండళ్ల సభ్యులు పాల్గొన్నారు.

పరేడ్‌లో పాల్గొన్న విద్యార్థికి సత్కారం



అజయ్‌కి ధ్రువపత్రం అందజేస్తున్న ప్రిన్సిపల్, అధ్యాపకులు

తిరుపతి సిటీ: ఢిల్లీ కేంద్రంగా ఈ నెల 26వ తేదీన జరిగిన గణతంత్ర దినోత్సవ పరేడ్‌లో పాల్గొని ప్రతిభ చూపిన ఎస్‌జీఎస్ ఆర్ట్స్ కళాశాలలో బీఎస్సీ ఫైనల్ ఇయర్ విద్యార్థి ఏ అజయ్‌ను కళాశాల అధికారులు గురువారం ఘనంగా సత్కరించారు. ప్రిన్సిపల్ డాక్టర్ బీ సత్యనారాయణ మాట్లాడుతూ అజయ్ ఎన్‌సీసీ ఎయిర్ వింగ్ విభాగంలో శిక్షణ పొంది ఢిల్లీలో జరిగిన గణతంత్ర దినోత్సవ కవాత్తులో పాల్గొన్నట్టు వెల్లడించారు. ఈ సందర్భంగా విద్యార్థికి ధ్రువపత్రాన్ని అందించి ఘనంగా సత్కరించారు. ఎన్‌సీసీ అధికారులు పీ.ఉదయ్, హరీష్‌రెడ్డి, కళాశాల అధ్యాపకులు తెలిపారు.

ఎమరాల్డ్స్ విజయకేతనం



విద్యార్థులతో ఎమరాల్డ్స్ డైరెక్టర్లు

తిరుపతి ఎడ్యుకేషన్: ఇటీవల సీఏ ఇన్‌స్టిట్యూట్ విడుదల చేసిన సీఏ ఫౌండేషన్ ఫలితాల్లో తిరుపతిలోని ఎమరాల్డ్స్ విద్యాసంస్థ విద్యార్థులు ఉత్తమ ఫలితాలు సాధించారు. ఈ ఫలితాల్లో ఆర్.సత్యా 314, ఎం.లావణ్య 265, కె.శ్రియ 259, ఆర్.యశ్వంత్ 257, దివాకర్‌రెడ్డి 256 మార్కులు సాధించారు. ఈ ఫలితాల్లో 56.34 శాతం మంది విద్యార్థులు ఉత్తీర్ణత సాధించినట్లు ఆ విద్యాసంస్థ డైరెక్టర్లు ఈ.గిరిధర్, కె.విశ్వనాథ్‌లు ఒక ప్రకటనలో తెలిపారు.

ఎర్రచందనం స్వాధీనం

భాకరాపేట: అక్రమంగా తరలిస్తున్న ఎర్రచందనాన్ని స్వాధీనం చేసుకుని, స్మగ్లర్‌ను అదుపులోకి తీసుకున్నట్టు భాకరాపేట ఫారెస్టు రేంజర్ దత్తాత్రేయ తెలిపారు. గురువారం భాకరాపేట అటవీ కార్యాలయంలో స్థానిక విలేకరులతో ఆయన మాట్లాడుతూ తలకోన అటవీ ప్రాంతంలోని సెంట్రల్ బీట్ పరిధిలో బుధవారం రాత్రి కూంబింగ్ చేపట్టామన్నారు. గురువారం తెల్లవారు జామున ఎర్రచందనం దుంగలను తీసుకుని వస్తున్న స్మగ్లర్లను గుర్తించి వారిని చుట్టుముట్టే ప్రయత్నం చేయగా.. స్మగ్లర్లు దుంగలు కిందపడేసి పారిపోయేందుకు ప్రయత్నించారని, అందులో ఒకరిని అదుపులోకి తీసుకుని విచారిస్తున్నట్టు తెలిపారు. నిందితుడు తమిళనాడు రాష్ట్రం శుభాకర్‌గోవిందరాజ్‌గా గుర్తించామన్నారు. ఆ ప్రాంతంలో 378 కిలోల బరువు గల 12 ఎర్రచందనం దుంగలను స్వాధీనం చేసుకున్నట్టు వెల్లడించారు. వాటి విలువ రూ.10 లక్షల వరకు ఉంటుందన్నారు. పారిపోయిన 11 మంది కోసం గాలిస్తున్నట్టు తెలిపారు. దాడుల్లో ఎఫ్ఎస్ఓ సల్లావుద్దీన్, ప్రదీప్‌చాంద్, లక్ష్మీప్రసాద్, రాజేష్, శంకర్ పాల్గొన్నారు.